కథానిక

# సంగీతపు విలువలు

ఆర్. యం. చిదంబరం

విజయ థియేటరు జనసమూహంతో కిటకిట లాడిపోతోంది. మెర్క్యురీలైట్లు దివ్యంగా మెరుస్తున్నాయి. హాలంతా సిగరెట్లపొగతో నిండిపోయింది. "సరస్వతీ సభ"వారు ప్రతి యేడాది ఉత్తమ గాయకురాలికొక బంగారుపతకం బహూకరించి గౌరవిస్తారు. ఈనాడు ప్రఖ్యాత గాయకీమణి సుమతి పాటకచేరీ ఉంది. ఆమెకే ఈయేడు బంగారుపతకం బహూకరించబడుతుందని అందరి అభిప్రాయం. హాలులోనివారంతా ఆమె రాకకోసం వెయ్యికన్నులతో యెదురుచూస్తున్నారు. ఆమె మధురగీతంకోసం చెవులు నిక్కబొడుచుకుని కూర్చున్నారు.

రంగదాసు పాటకచేరీకి రాకూడదనే అనుకున్నాడు. సుమతిమీద అసహ్యం అతని హృదయంలో చిగిర్చి, చెట్టయి కాయలుకాచింది. కాని అతనికి తెలియని ఏదో శక్తి అతన్నిక్కడకు లాక్కునివచ్చింది. అదే బండిచక్రంలా తిరుగుతున్న మానవజీవితాన్ని పాతాళానికి తొక్కి ఆకాశానికి ఎత్తుకుపోయే ఆ వాత్సల్యం ఆ ప్రేమ. అదే రంగదాసునక్కడికి లాక్కుని వచ్చింది.

బయట బుకింగ్ ఆగిపోవటంవలన జనమంతా గగ్గోలుపడుతున్నారు. కొంతమంది కొంటెకోణంగులు రాళ్ళువిసిరి బల్బులు బ్రద్దలుకొడితే పోలీసు వచ్చి కాపలా కాయసాగింది. ఆమె దర్శనమన్నా లభిస్తుందేమోనని కొందరు ఎదురుచూస్తున్నారు. ఇంతలో మెరుపు మెరసినట్లొక కారువచ్చి లోపలికి తుర్రుమంది. ఆమె దర్శనంకోసం వచ్చినవారికి నిరాశయింది.

పదినిమిషాలలో కార్యక్రమం ప్రారంభమయింది. కార్యదర్శి సుమతిని సభకు పరిచయం చేశాడు. ఒకామె ఆమె మెడలో గులాబీదండ వేసింది. సుమతి సభకు నమస్కరించి కల్యాణి రాగంతో కార్యక్రమం ప్రారంభించింది. ఆ కంఠంలో వేయిమధురస్వరాలు సరస్వతి ప్రతిభను ఎత్తి చాటాయి. ఆ కోకిలస్వరాన్ని కాలదన్నే మధురాతిమధురకంఠం సభికుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది.

కాని రంగదాసు పాట ప్రారంభం కాగానే చెవులుమూసుకున్నాడు. కొందరతన్ని వింతగా చూశారు. రంగదాసుకి ఆ పాటవెనుక గర్వం, అసూయ దాగిఉన్నట్టు కనిపించింది. అపశ్రుతులతో కూడిన పాటలాగా వినిపించింది. అతని శరీరమయితే అక్కడుండికాని మనసు ఎక్కడో కొన్ని యేళ్ళక్రితపు వాతావరణంలో — జీవితపు పరవళ్ళమధ్య మసలుతోంది.

రంగదాసు గొప్ప సంగీత విద్వాంసుడు. సంగీతములోని మిట్టపల్లాల్ని కరిగించి త్రాగిన మహనీయుడు. అన్ని శాఖల్లోను ఆరితేరిన వాడు. ఎంతో గౌరవం పొందినవాడు. అయితే కళాకారుని వెంట ఇనుపగజ్జెలతల్లి కూడా ఉంటుందిగా? ఆ బాధే రంగదాసు అనుభవించాడు. కాని నిజమైన కళాకారుడికి డబ్బులేకపోవటం ఒక బాధకాదు. కళలో తన్మయత్వంచెంది స్వర్గ సుఖమనుభవించకలడు.

అది చలికాలం చల్లగాలివీస్తోంది. ప్రాణులన్నీ చలికి గజగజ వణుకుతున్నాయి. ప్రకృతి నిశ్శబ్దంగా ఉంది. రంగదాసు కుర్చీలో కూర్చుని ఆకాశంకేసి చూస్తున్నాడు. నక్షత్రాలు మిలమిల మెరుస్తుంటే ప్రకృతి సౌందర్యంలో జమ కడతాం కాని రంగదాసుకి అవన్నీకలిసి ఏదో ఒక మహత్తర రాగాన్ని ఆలాపనచేస్తూ స్వేచ్ఛగా సంగీతం పాడుతున్నట్టనిపించింది. అలాగే తన్మయుడైపోయాడు. ఆ సంగీతం ఇంకా స్పష్టముగా వినిపిస్తూంటే మ్రోడులాగ ఆకాశంకేసి కనులప్పగించి చూస్తూ కూర్చున్నాడు. అతని కళ్ళల్లో ఆనందబాష్పాలు నిండాయి.

"నమస్కారమండి రంగదాసుగారూ."

రంగదాసు ఉలిక్కిపడి లేచాడు. ఆ ఊరి

కంతా శ్రీమంతుడు జమీందారు వెంకట్రామయ్య వచ్చాడు. అతను ఆశ్చర్యపోయాడు.

“రండి...కూర్చోండి” అని తను లేచి కుర్చీ చూపించాడు తడబడుతూ.

కుర్చీలో కూర్చుని ఒక్కసారి ఆ విద్వాంసుని తేరిపారచూచి “ఇకనే వచ్చిన విషయం చెబుతాను. నారాక మీకు ఆశ్చర్యాన్ని కలిగించి ఉంటుంది. మీరు మహావిద్వాంసులు, వాగ్దేవికి సుపుత్రులు. మహాపండితులు” అని ఆగాడు జమీందారు.

“అంతగా నన్ను పొగడనక్కర్లేదు. అంతా దైవకృప”అన్నాడు వినయంతో రంగదాసు.

“అలాగనకండి-ఓరుగాలి దీపముంచి దేవుడా నీ గుమహిమ చూపుమన్న మాడిక్కి మిత్ర అన్నారు. దైవం ఇచ్చినదానిని స్వయంకృషిచేత రాణించేట్టు చేసుకోవాలి. అది మీరుచేశారు. కనుక ఇది అతిశయోక్తి కాదు.”

రంగదాసు మౌనం వహించాడు.

“అలాగే మా అమ్మాయి సుమతికి దైవం చక్కటి కంఠాన్ని ప్రసాదించాడు. దానిని సక్రమమార్గంలో పెట్టడం నావిధి. అందుకోసమే మీదగ్గరకు వచ్చాను. మీరనుగ్రహించి మా అమ్మాయికి సంగీతం నేర్పాలి. మీరు మాఇంటికి వచ్చేయండి. ఈ బీదజీవితం మీవంటి కళాకారు నుభవింపదగ్గదికాదు. ఆ జన్మాంతరం మాదగ్గరే ఉండిపొండి” అని ప్రార్థించాడు జమీందారు. రంగదాసుకు పట్టరాని సంతోషం కలిగింది. ఈ అవకాశాన్ని ఎవరు జార విడుచుకుంటారు? అంగీకరించాడు.

నాటినుండి అతని జీవితంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమైంది. చీకటిలో ఉన్నవాడు ఒక్కసారి వెలుగులో పడ్డాడు. ఆశాసౌధాలు ఉవ్వెత్తుగాలేచాయి.

సుమతికి సంగీతం నేర్పటం ప్రారంభించాడు. ఆమె కంఠాన్ని విని రంగదాసు మైమఱచిపోయాడు. తనకళను నలుదిక్కులా వ్యాపింపజేయటానికి తగిన అవకాశం లభించినందుకు ఉబ్బిపోయాడు. తనకు వచ్చిన కళంతా ఆమెకు నేర్పాడు. తనకు వచ్చిన వాయిద్యాలన్నీ నేర్పాడు. త్యాగరాజ కృతులన్నీ నేర్పాడు. అష్టపదులు నేర్పాడు. ఐదేళ్లలో ఆమెను సంగీత కళానిధిగా చేశాడు. ఆమె పాడుతూంటే తానెక్కడున్నాడోకూడా తెలుసుకోలేని స్థితిలో ఉండేవాడు.

సంగీత శిక్షణ పూర్తయింది. జమీందారు మాట ఇచ్చినట్టుగా రంగదాసును తన యింట్లోనే ఉంచుకుని ఏలోటూ లేకుండా చూస్తున్నాడు. అతని జీవితం యిలాగ సాగిపోయినా బాగుండేది. కాని బండిచక్రం విరిగింది.

ఒకనాడు రంగదాసు వీధంటపోతుంటే ఒక అపరిచిత వ్యక్తి నమస్కరించాడు. ఆశ్చర్యంతో ప్రతినమస్కారం చేశాడు. ఆ వ్యక్తి “మీరు నన్నెరుగరు. కాని మిమ్మల్ని నేనెరుగుదును. మీతో ఒకవిషయం మాట్లాడాలి. ఇదే మాఇల్లు. దయచేసి ఒక్కనిమిషం-” అని వినయంగా అడిగాడు. రంగదాసు అతన్ని వెంబడించాడు. చింకిచాపవేసి రంగదాసును కూర్చోబెట్టాడు. అతనికొక్కసారిగా వెగటు పుట్టుకొచ్చింది. ఇల్లంతా పరమాసహ్యంగా ఉంది. తను గడచిన బీదజీవితం జ్ఞప్తికొచ్చి కంపమెత్తింది. ఇంతలో ఆవ్యక్తి ఓ పదిపన్నెండేళ్ల పిల్లను తీసుకొచ్చి రంగదాసుకు నమస్కారం చేయించాడు. రంగదాసు అయోమయంగా చూచాడు.

“ఈ పిల్లపేరు శారద. శారద నాపిల్లకాదు. మా బంధువుల పిల్ల కాదు. అసలెవరిబిడ్డో నాకు తెలియదు. దిక్కుమాలినది. ఒకనాడు బెజవాడ ప్లాటుఫారంమీద తిరుగుతూండగా ఈ పిల్ల భోరున ఏడుస్తూ కనిపించింది. ఎందుకేడుస్తున్నావని ఎవ్వరూ అడుగటంలేదు. నాకే జాలికలిగి అడిగాను. తనది రాయలసీమని తాము చాలా బీదవారమని, తనను తలీదండ్రులిక్కడ వదలిపోయారని చెప్పి ఏడ్చింది. నా గుండె కరిగిపోయింది. ఆమెను వదలిపోటానికి మనసొప్పలేదు. ఆపిల్ల కంఠంలో ఏదో తియ్యదనం కనిపించింది నాకు. తీసుకొచ్చేశాను. ఇది నాలుగేళ్లక్రితం మాట. అప్పటినుండి ఈ పిల్ల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నానుకాని నాకు ఏమార్గమూ కనిపించలేదు. నేను ఈ ఊరువచ్చి నెలరోజులయింది- మీగురించి తెలుసుకున్నాను. నా నెత్తిమీద బరువు దిగిందనుకున్నాను. భగవంతుడు ఎలాగా తియ్యటికంఠం ప్రసాదించాడు. నేను కటిక దరిద్రుడిని గనుక కట్నాలుపోసి శారదకు పెళ్లి

చేయలేను. ఆమెను సంగీతం నేర్పి లోకంమీదకు వదిలేయండి. తన బాధ్యతను గుర్తించి బ్రతుకుతుంది. ఇంతకాలం పోషించాను. ఇక పోషించలేను. కనికరించండి" అని కన్నీరుకార్చాడు.

రంగదాసు హృదయంచలించింది. అతనికోర్కె తీర్చాలనుకున్నాడు. కాని జమీందారు ఏమంటాడో అనుకున్నాడు.

"వెంకట్రామయ్యగారు కరుణామయులని విన్నాను. మీరు ప్రయత్నిస్తే వారుకాదనరు. చిత్తగించాలి" అన్నాడా వ్యక్తి

"నీకేం బాధలేదు. అంతా నేను చూసుకుంటాను. శారద బాధ్యత నాది. ఆమెవిషయంలో శ్రద్ధతీసుకుంటానని నీకు ప్రమాణంచేస్తున్నాను" అని రంగదాసు శారదతో వెళ్ళిపోయాడు.

ఆ వ్యక్తికళ్ళు చెమ్మగిల్లాయి.

రంగదాసు భావించినట్టుగా జమీందారు వారించలేదు. శారదను ఆప్యాయంతో ఆదరించాడు.

"ఈమెనుకూడా సంగీతకళానిధిగా చేయండి" అని ఉత్సాహంతో అన్నాడు. రంగదాసు శారదకు మొక్కాడు. కాలచక్రం గిరగిర తిరుగుతోంది.

శారదవచ్చి సంవత్సరమయింది. కాని అఖండ సంగీత సంపత్తిని సంపాదించింది. రంగదాసు మనసు ఆనందంతో పరవళ్ళుత్రొక్కింది. ఎవరూ అందుకోలేని ఆనంద శిఖరాన్ని హృదయంలో స్మరించాడు.

ఒకనాడు జమీందారు స్నేహితుడొకాయన చాలాదూరంనుండివచ్చాడు. జమీందారు తన కుమార్తె కళానైపుణ్యాన్ని ప్రదర్శించటానికి ఆమెనుపిలిసి "ఒక పాటపాడమ్మా" అన్నాడు.

సుమతి వీణనందుకుని పాడింది. వీణతీగల మీద వేళ్ళు నాట్యంచేశాయి. స్నేహితుడు పాట ముగిసేవరకూ తదేకధ్యానంతో కూర్చున్నాడు.

పాట ముగిసింది.

"ఆహాహా! ఎంత మధురకంఠం! నిజంగా సరస్వతి తనకరుణంతా నీమీదనే ఒలకబోసిందమ్మా" అని ఆశ్చర్యపడ్డాడు మిత్రుడు.

జమీందారు ముఖంలో గర్వరేఖ జాడ చూపింది. శారదను కూడాపిలిచి పాడమన్నాడు.

శారద వీణమీదకృతిని గానంచేసింది. స్నేహితుడు ఉండబట్టలేక పాట ముగియకుండానే "నువ్వు నిజంగా శారదాదేవివే!" అన్నాడు.

పాటముగియగానే మరొకటి పాడమన్నాడు. శారద వినయంతో పాడింది. ఎన్నిపాటలయినా పాడమని అడిగేవాడే కాని మర్యాద అడ్డొచ్చింది. శారద వెళ్ళిపోయింది.

"వెంకట్రామయ్యగారూ! మీ జీవితం నిజానికి ధన్యమయినదండి. శారదకంఠంలో ఉన్న అమృతత్వం చూచారా? అది ఈ ప్రపంచంలో ఎవరికీరాదు. అదంతా పూర్వజన్మలో చేసిన పుణ్యఫలితం. శారదకు మంచి భవిష్యత్తుంది. ఆమె మణిలాగ వెలుగుతుంది" అన్నాడు స్నేహితుడు.

జమీందారు ముఖకవళికలు మారాయి.

"సుమతికంటేనా?" అనడిగాడు.

"శారదకులాటి ఈ లోకంలో ఎవరూ లేరు అంటే సుమతి కంఠం శ్రావ్యమైనది కాదని కాదు"

"మీ అభిప్రాయం అర్థం చేసుకున్నాను" ముక్తసరిగా జమీందారు.

ఇదంతా గమనిస్తున్న రంగదాసు యెదలో ఏదో ఆందోళన బయలుదేరింది. ఆ సాయంత్రమే జమీందారు రంగదాసును పిలిచి "శారదకు తగినంత సంగీతం నేర్పారు చాలు. అందర్నీ భరించటం కష్టం. ఆమెను పంపేయండి" అన్నాడు. రంగదాసు శారద తరఫున వాదిద్దామనుకున్నాడు. కాని నోరురాలేదు. తనను పోషిస్తున్న జమీందారు మాటకు తిరుగు చెబితే ఏం జరుగుతుందోనని జంకి ఊరుకున్నాడు. కాని జమీందారిలాగ హటాత్తుగా మారటానికి కారణం మాత్రం రంగదాసు ఎంతవెదకినా దొరకలేదు.

ఈమాట శారదలో ఎలాగ చెప్పటమా అనే సంకోచంలోపడ్డాడు రంగదాసు. ఒక వృథాజీవికి తను శారదను రక్షిస్తానని వాగ్దానంచేశాడు. కానిప్పుడు డబ్బుకోసం ఆ మాటను జవదాటటమా? అని యోచించాడు. చివరికి శారదను తీసుకుని తన ఇంటికి పోవటానికి నిర్ణయించాడు.

ఈ నిశ్చయంతో వెళ్ళిన రంగదాసుకు శారద తన గదిలో కనిపించకపోయేసరికి గుండె గతుక్కుమంది. ఆ వాతావరణానికి బల్లమీది ఉత్తరం జవాబు చెప్పింది.

"మేష్టారికి నా నమస్కారాలు. జమీందారుగారి మాటలు విన్నాను. ఆయన్ని బాధించటం

నాకు న్యాయంకాదు. ఇంతవరకు నన్ను కాపాడినందుకు ఆయనకు నేను ఋణపడి ఉన్నాను. నేను వెళ్ళిపోతున్నానన్న సంగతి మీకు చెబితే వెళ్ళనివ్వరు. మీకుకూడా దానివల్ల ఇబ్బందులు కలుగుతాయి. నేను వెళుతున్నా. ఆశీర్వదించండి క్షమించండి.''

ఉత్తరం చదువుకుని రంగదాసు కుప్పలు కూలిపోయాడు ఇక ఆ యింట్లో ఉండటానికిష్టంలేక జమీందారుతో కాని సుమతితో కాని చెప్పకుండా ఆ ఊరువిడిచి వెళ్ళేకాడు. తన ఇంటిని అమ్మేసి ఆ డబ్బుతో వెళ్ళిపోయాడు. యథారీతిగా కాలక్షేపంచేయ నారంభించాడు.

*        *        *

ఒకనాడు రంగదాసు పత్రికలో ఒక ప్రకటన చూచాడు, అది విజయవాడలో జరగబోయే సంగీత కచేరీ గురించి. గాయకురాలు సుమతి-రంగదాసు గుండె దడదడ కొట్టుకుంది. పట్టరాని సంతోషం కలిగింది. తన ప్రయత్నం ఫలించినందుకు ఉప్పొంగిపోయాడు. నాలుగు రూపాయలు పెట్టి టిక్కెట్టు కొనుక్కుని విజయవాడలో వాలాడు.

సంగీత కచేరీకి హాజరయ్యాడు. సుమతిపాట విన్నాడు. పరవశుడయ్యాడు. అంతా అయిపోయాక సుమతినభినందించటానికి వచ్చాడు. కాని సుమతి గమనించికూడా చూడనట్లు నటించింది. అతని అభిమానం దెబ్బతింది. అవమానంతో తల బరువెక్కింది.

"మీ గురువెవరండి"అనొక పత్రికా ప్రతినిధి వేసిన ప్రశ్న విని ఆగాడు. జవాబుకోసం ఆశగా చూచాడు. "ఆ...గురువుల్లో ఏముంది? అంతా స్వయంకృషిమీద ఆధారపడిఉంటుంది. క్లాసులో మేష్టారు పాఠాలు చెబుతారు. కాని అందరూ మంచిమార్కులు తెచ్చుకుంటున్నారా?

రంగదాసుకు వజ్రఘాతం తగిలినట్లయింది. తల బరువెక్కింది. దుఃఖం కూడా వచ్చింది. "మనుష్యులింత" అన్న వైరాగ్యభావంకూడా కలిగింది. బరువుగా అడుగులు వేసుకుంటూ తిరిగి వచ్చాడు.

త్వరలోనే సుమతి పెద్ద పేరు తెచ్చుకుంది. ఎన్నో కచ్చేరీలు, సన్మానాలు జరిగాయి. ఈ మధ్య సినిమాల్లో ప్లేబాక్ సంగీతంకూడా పాడుతోంది. శాస్త్రీయసంగీతాన్ని వదిలేసి క్రమంగా చౌకబారు సంగీతంలోకి దిగుతోంది. మెట్లుదిగుతున్న కొద్దీ గౌరవం ఎక్కువవుతోంది.

సుమతి పాటకచేరీలకు పోకూడదని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయాన్ని నేటివరకూ కాపాడాడు. కాని సుమతిలో మార్పువచ్చిందేమోనని వచ్చాడు.

కానతని హృదయం నిరంతరం శారదనుగురించి ఆలోచించేది. ఆమెనభాగ్యురాలిగా వదలినందుకు గోలపెట్టేది. కాని నీరుపోయాక ఆనకట్టెందుకు? అంతరాత్మ పీడిస్తోంది. "పీడించనీ"అనే వేదాంతంతో సరిపెట్టుకున్నాడు. ఒకనాడు వార్తా పత్రికలో పదహారేళ్ళ అమ్మాయి రైలుక్రిందపడి చనిపోయిందని చదివాడు. కన్నీరుమున్నీరుగా ఏడ్చాడు.

చప్పట్లమోతతో రంగదాసు ఉలిక్కిపడి ఈ లోకంలోకివచ్చాడు. సుమతిపాటవిని అందరూ ఆనందతన్మయులవుతున్నారు.

సుమతి మరి రెండుపాటలుపాడి కచేరీ పూర్తి చేసింది. ఇప్పుడు శ్రీమతి శారదగారు పాడుతారు ఇది ముందుగా ప్రోగ్రాంలో ప్రకటించబడలేదు. మీరు నిశ్శబ్దంగా ఉండాలి. ఇదయిన తరువాత శ్రీమతి సుమతిగారికి సన్మానం జరుగుతుంది"అని కార్యదర్శి ప్రకటించాడు.

"ఆ శారద కాదుకదా!" అనుకున్నాడు రంగదాసు. తన వెర్రితనానికి తనకే నవ్వువచ్చింది.

శారద మైక్ ముందు కూర్చుంది. రంగదాసుకు "షాక్" తగిలినట్లయింది. ఆశారదే! అదే చిరునవ్వు! అదే వినయం! శారద చనిపోలేదు! రంగదాసుకు ఒక్కసారి ఎగిరి గెంతెయ్యాలన్నంత సంతోషం కలిగింది.

శారద ఆనందభైరవి రాగంతో ప్రారంభించింది. రంగదాసు కళ్లు ఆనందంతో మెరిశాయి. సుమతి పాటలో కనిపించిన లోపాలు శారద పాటలో అతనికి కనిపించలేదు. శారద గానంలో లీనమైపోయాడు — శారద సంగీత కచేరీకూడా ముగిసింది.

కార్యదర్శి మైక్ ముందు నిలబడి "శ్రీమతి శారదగారు చాలా అమోఘంగా పాడారు. సుమతిగారిని మించారని చెప్పటానికి చాలా సంతోషంగా ఉంది. ఇలాగే ఎంతోమంది రచయితలు, గాయకులు, కళాకారులు మారుమూల

లలో ఉండి బయటకు రాలేకపోతున్నారు. దీనికి ముఖ్యకారణం వారికి ప్రోత్సాహం లేకపోవటమే. కనుక వారికి ప్రోత్సాహమివ్వటం అత్యావశ్యకం. అప్పుడుకాని యువక హృదయాలలో ఉండే భావాలు వెలికిరావు. ఈ సభ అందుకోసమే స్థాపించబడింది. కనుక మాజడ్జస్ తీర్పు ప్రకారం ఈయేడు బంగారు పతకాన్ని శ్రీమతి శారద గారికి బహూకరిస్తున్నాం" అని ప్రకటించాడు. శ్రోతలు చెవులు తూట్లుపడేటట్టు చప్పట్లు కొట్టారు. రంగదాసు ఒకవైపు ఆశ్చర్యంతోనూ మరొకవైపు సంతోషంలోనూ ఉక్కిరి బిక్కిరయ్యాడు.

శారద ముందుకువచ్చి బహుమతి నందుకుంది. సభికులకు నమస్కరించి "ఇందులో నా ప్రజ్ఞ ఏమీలేదు. ఇదంతా నాగురువు-మహా విద్వాంసులు అయిన శ్రీరంగదాసుగారి దయ" అంది. ఇది విన్న రంగదాసుకు గుండె ఆగినంతపనయింది. తప్పట్లు మిన్నుముట్టాయి.

సుమతి అక్కడ నిలువలేకపోయింది. తన ఆశాసౌధం కూలిపోయింది. కారులో వెళ్లిపోయింది.

రంగదాసు వెళ్లి శారద నభినందిద్దామనుకున్నాడు. కాని కాళ్లు ముందుకు సాగలేదు. ఆమెకు తానేదో ద్రోహం చేసినవాడికి మల్లే భయపడ్డాడు. ఆమె శ్రేయస్సుకోసం దైవాన్ని ప్రార్థించి వెనుదిరిగాడు.

తన యింటిదగ్గర సుమతి ఉండటం గమనించాడు రంగదాసు.

"మేష్టారూ! నన్ను క్షమించండి. దైవతుల్యులైన మిమ్మల్ని బాధించినందుకు తగిన ప్రాయశ్చిత్తం జరిగింది. ఈ అవమానాన్ని భరించటం యెలాగ? శారదనుకూడా హింసించాను. నన్ను మన్నించకపోతే గతిలేదు." అని విలపించింది సుమతి.

"ఊరుకోమ్మా! జయాప జయాలు దైవాధీనాలు. ఒక్కసారి శారదతో మాట్లాడితేకాని నా నెత్తిమీది బరువు దిగదు. పోదాం పద" అన్నాడు రంగదాసు—

---

కథానిక

# చెడిపోయిన జగ్గయ్య

ముద్దంశెట్టి హనుమంతరావు

మానవుల మనస్తత్వాలు కాలం మార్పుతో మారుతూనే వుంటాయి. పెద్దలకున్న అభిప్రాయాలూ, ఆశయాలూ పిన్నలకుండవు. పిన్నలకుండే ఆశయాలు అంతకంటె చిన్నవారికుండకపోవచ్చు. ఒక్కొక్కరి కొక్కదానిపై అభిమతముంటుంది. నాగరికులవుతున్నకొద్దీ సభ్యతలూ, వేషభాషలూ మారుతూవుండటం సహజం.

జగ్గయ్య మిలిటరీలో, యెవ్వరికీ తెలియకండా చేరాడనీ, తల్లి మరణానికతడే కారకుడనీ, కనీ, పెంచి పెద్దవానిగా చేసినందుకు ఇదే వాడు కావించిన మహోపకారమనీ ఆగ్రామంలో పెద్దతలకాయలన్నీ అనుకున్నాయ్. ఆగ్రామం చెప్పుకోవాలంటే అట్టే పల్లెటూరు కాదు - పట్టణమూ కాదు. మధ్యవర్గానికి చెందుతుంది. రమారమి పది పన్నెండు బట్టలకొట్లు కూడా వున్నయ్. అయినా అక్కడి ప్రజల్లో చాలమందికి వ్యవసాయం కలకాలంగా వస్తూన్న వృత్తి. జగ్గయ్య తండ్రి, వెంకయ్యకూడా లేదనకండా ఓ పదెకరాల మాగాణీ మూడెకరాల మెట్టభూమి వుంది. దాన్ని స్వంతంగా సేద్యంచేసుకుంటూ జీవితాన్ని గడుపుతున్నాడు.

వెంకయ్య భార్య సీతమ్మ. వారికి జగ్గయ్య ఒక్కడే కొడుకు. అతనికంటె చిన్నది చెల్లెలు కూడా ఒక్కతే. సీతమ్మకు, కొడుకంటే పంచప్రాణాలు. జగ్గయ్య చిన్నతనంనుండి చదువుయందు అభిలాష చూపుతుండేవాడు. గ్రామంలో ఎలిమెంటరీస్కూలుకి ప్రతిదినం తప్పకండా పోయిన వాళ్ళల్లో జగ్గయ్య ఒకడు. వెంకయ్యకు చదువుపై అంత వున్నత అభిప్రాయాలు లేకపోయినా, "వాడికేది యిష్టమయితే అదే చెయ్యనీండి" అం